చాకలి ఐలమ్మకు ఘన నివాళి

చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్/నస్పూర్,సెప్టెంబర్ 10 : ఆసిఫాబాద్, మంచిర్యాల కలెక్టరేట్ లలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం అధికారికంగా నిర్వహించారు. ఆయాచోట్ల ఐలమ్మ చిత్రపటాలకు కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) దాసరి వేణు, మోతీలాల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, ఆర్డీవో లోకేశ్వర్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారులు సజీవన్, వినోద్‌కుమార్, ఫ్యాక్స్ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, రజక సంఘం జిల్లా అధ్యక్షులు కడతల మల్లయ్య, వెంకటేశం, జ్యోతిబాపూలే సంఘం అధ్యక్షుడు శంకర్, సభ్యులు భాగ్య, లక్ష్మణ్, బాపు, నాయకులు పాల్గొన్నారు.

ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

గిరి విద్య అస్తవ్యస్తం

డిప్యూటేషన్లు లేకుండా కోరుకున్న దగ్గర పని

- ఓ చోట విధులు.. మరొకచోట జీతం తీసుకుంటున్న వైనం
- ఏసీఎంవో ఆగడాలంటూ మండిపడుతున్న టీచర్లు
- ఆమ్యామ్యాలు ముట్టచెబితే కావాల్సిన చోట పోస్టింగ్ ఇస్తున్నారంటూ ఆగ్రహం
- పర్యవేక్షణ లోపంతో ఆగమైపోతున్న గిరిజన విద్యార్థులు..!
- న్యాయం చేయాలంటూ రోడ్డుకెక్కిన ఉపాధ్యాయులు

మంచిర్యాల, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొందరు ఉన్నతాధికారుల తీరుతో అభాసుపాలవుతున్నది. ఆ శాఖలో రోజుకో వ్యవహారం తెరపైకి వస్తుండగా, ఉద్యోగులను గందరగోళానికి గురిచేస్తున్నది. ఇటీవల వార్డెన్‌ల బదిలీల్లో జరిగిన అక్రమాలపై ఆగస్టు 28న 'నమస్తే తెలంగాణ' 'గిరి సంక్షేమ శాఖలో బదిలీలలు' శీర్షికన కథనం ప్రచురితమవ్వగా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా స్పందించి అర్హులకు పోస్టింగ్‌లు వచ్చేలా న్యాయం చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో.. ఈ నెల 9న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్‌టీ) బదిలీల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ ఉపాధ్యాయులు రోడ్డుకెక్కారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలో అర్ధరాత్రి ధర్నా చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం మధ్యాహ్నం ఆదివాసీ నాయకులతో కలిసి మరోసారి ధర్నా చేశారు. మంచిర్యాల గిరిజన సంక్షేమ శాఖలో పని చేసే ఏసీఎంవో కొందరి వద్ద డబ్బులు తీసుకొని.. వారికి కావాల్సిన దగ్గర పోస్టింగ్‌లు ఇచ్చారంటూ ఆరోపించారు. ఏసీఎంవోకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. నిర్మల్‌కు బదిలీపై వెళ్లిపోయిన ఆయన అక్రమ డిప్యూటేషన్‌తో తిరిగి వచ్చి మంచిర్యాలలోనే పని చేస్తున్నారని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో చాలా మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్లు లేకుండా ఇష్టం వచ్చిన చోట పనిచేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులకు డబ్బులు ఇస్తే చాలు డిప్యూటేషన్ ఆర్డర్ లేకుండా ఎక్కడ కావాలంటే అక్కడ పని చేసేందుకు అనుమతులు ఇస్తున్నారని మండిపడ్డారు.

మరోసారి పీవోను తప్పతోవ పట్టించారా..!

సాధారణంగా ఏసీఎంవో (అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్) పోస్టు, స్థానిక ఉపాధ్యాయులకు మాత్రమే ఇవ్వాలి. కానీ మంచిర్యాల జిల్లాలో మాత్రం నిర్మల్‌కు బదిలీ అయిన వ్యక్తికి డిప్యూటేషన్ ఇచ్చి మరీ ఇక్కడే కొనసాగిస్తున్నారు. ఈ ఏసీఎంవోతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 90 మంది ఏసీఎంవోలను ట్రాన్స్‌ఫర్ చేశారు. 'వారందరినీ కాదని ఈయన ఒక్కరికే డిప్యూటేషన్ ఇవ్వాల్సిన అవసరం ఏమిటి. అలాగైతే 90 మందిని ట్రాన్స్‌ఫర్ చేయకుండా ఎక్కడి వారిని అక్కడ కొనసాగించవచ్చు కదా. బదిలీ చేయడం దేనికి.. అన్ని అర్హతలు ఉండి ఏసీఎంవో పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారిని పక్కన పెట్టి బదిలీపై వెళ్లిపోయిన వ్యక్తిని ఏసీఎంవోగా ఎందుకు కొనసాగిస్తున్నారు.' అని అర్హులైన ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏసీవోల పోస్టింగ్‌కి ఒక ప్రాసెస్ ఉంది. నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తు చేసుకున్న వారికి పరీక్ష నిర్వహించి ఎంపిక చేయాలి. ఆశ్రమ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న వారు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. మంచిర్యాల ఏసీఎంవో బదిలీ అయ్యాక అర్హులైన వారు దరఖాస్తు సైతం చేసుకున్నారు. కానీ ఈ విషయాన్ని తొక్కిపెట్టి ఇక్కడ ఎవ్వరూ పని చేయడానికి సిద్ధంగా లేరు. నాకే పోస్టింగ్ ఇవ్వండి అని ఇప్పుడున్న ఏసీఎంవో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు చెప్పుకున్నారట. అందుకే పీవో డిప్యూటేషన్ ఇచ్చారని తెలిసింది. కానీ ఇక్కడ పని చేయడానికి అప్లికేషన్లు పెట్టుకున్న టీచర్లు ఉన్నారన్న విషయం మేడమ్ దృష్టికి వెళ్లలేదని సమాచారం. గతంలో వార్డెన్‌ల పోస్టింగ్ విషయంలో డబుల్ గేమ్ ఆడి పీవోను తప్పుతోవ పట్టించిన జిల్లా అధికారులు ఈ విషయంలోనూ మేడమ్ బోల్తా కొట్టించారని అర్హులైన ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. పీవో డిప్యూటేషన్ ఆర్డర్ ఇస్తే దాన్ని బయట పెట్టాలంటున్నారు. ఒకవేళ పీవో ఆర్డర్ ఇచ్చి ఉంటే జిల్లాకు చెందిన వారితోనే ఈ పోస్టు భర్తీ చేయాలి అనే విషయం మేడమ్ దృష్టికి మంచిర్యాల జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (డీటీడీవో) తీసుకెళ్లారా.. లేదా.. అనే విషయంలో అనుమానాలు ఉన్నాయంటున్నారు.

స్థానిక గిరిజనులకే ఇవ్వాలి..

ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో గిరిజనులకే ఏసీఎంవో పోస్టులు ఇచ్చారు. మంచిర్యాలలో మాత్రం గిరిజనేతరుడికి పోస్టు ఇచ్చారు. దాన్ని మార్చాలంటూ ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అర్హులైన గిరిజనులను కాదని గిరిజన వ్యతిరేకిని ఆ పోస్టులో ఉంచారని ఆరోపిస్తున్నారు. పీవో ఇచ్చింది పూర్తిగా ఇల్లీగల్ ఆర్డర్ అని.. ప్రాసెస్‌ను అనుసరించి స్కూల్ అసిస్టెంట్ సీనియర్లకు ఆ పోస్టు ఇవ్వాలని, నోటిఫికేషన్ ఇచ్చి, దరఖాస్తు చేసుకున్న వారికి పరీక్ష నిర్వహించి భర్తీ చేయాలని కోరుతున్నారు. జిల్లాకు సంబంధించిన వారితో భర్తీ చేయాల్సిన పోస్టును డీటీడీవో డబ్బులకు అమ్ముకున్నారని, అందుకే నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా డిప్యూటేషన్ ఇచ్చారని ఆరోపిస్తున్నారు. అలాంటిదేదీ లేకపోతే వెంటనే అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మంచిర్యాల డీటీడీవో గిరిజన వ్యతిరేకి అన్నారు. జన్నారంలో స్కూల్ సామగ్రి అక్రమంగా తీసుకెళ్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుపట్టారని, మల్కపల్లిలో ఓ పిల్లాడు కాలిపోయిన ఘటనలో ఆయన్ని సస్పెండ్ చేశారని, గతంలో సదరు అధికారిపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయంటున్నారు. అలాంటి వ్యక్తిని ట్రాన్స్‌ఫర్ అయ్యాక కూడా ఎలా కొనసాగిస్తారని మండిపడుతున్నారు. అధికారుల తీరుతో గిరిజన విద్యార్థులు ఆగమైపోతున్నారంటున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గడానికి కూడా అధికారుల తీరే కారణమని ఆరోపిస్తున్నారు.

మంచిర్యాల ఐబీ చౌరస్తాలో ఏసీఎంవోకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు, ఆదివాసీ నాయకులు

ఎలాంటి ఆర్డర్లు లేకుండానే విధులు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎలాంటి ఆర్డర్‌లు లేకుండా పని చేస్తున్న ఉపాధ్యాయులు చాలా మంది ఉన్నట్లు తెలిసింది. ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లకుండా డిప్యూటేషన్ ఆర్డర్లు లేకుండా పాత పాఠశాలల్లోనే ఇప్పటికే పని చేస్తున్నారు. కాకపోతే జీతం మాత్రం ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యారో అక్కడి నుంచి తీసుకుంటున్నారు.

ఉదాహరణలు

- భీమారం ఆశ్రమ పాఠశాలలో పని చేసే ఓ టీచర్ గతంలో నెన్నెల మండలం కృష్ణపల్లికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఆయన ఈ మధ్య చెన్నూర్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎలాంటి డిప్యూటేషన్ ఆర్డర్ లేకుండా కృష్ణపల్లి హెచ్ఎంగానే కొనసాగుతున్నారు. ఆయనకి జీతం మాత్రం భీమారం నుంచి ఇచ్చారు. గత నెల సైతం ఎలాంటి అటెండెన్స్ సర్టిఫికెట్ లేకుండా జీతం ఇచ్చారు. కలెక్టర్ తనిఖీల్లో ఆయన విధుల్లో లేనట్లు గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తే ఒక ఇంక్రిమెంట్ కట్ చేశారు. అయినప్పటికీ ఆయన ఇంకా కృష్ణపల్లిలోనే విధులు నిర్వహిస్తున్నారు. ● కోటపల్లిలో పని చేయాల్సిన ఒక తెలుగు టీచర్ ఎలాంటి డిప్యూటేషన్ లేకుండా లక్షెట్టిపేటలో పని చేస్తున్నారు. ఈయనతో పాటు మరో ఇద్దరు తెలుగు టీచర్లు లక్షెట్టిపేటలో పని చేస్తున్నారు. వేరే దగ్గర ఖాళీలు ఉన్నప్పటికీ ముగ్గురు టీచర్లు ఒకే దగ్గర ఉంటున్నారు. ● చెన్నూర్ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు అనధికారికంగా లక్ష్మీపూర్‌లో పని చేస్తున్నారు. ● భీమారం స్కూల్‌లో హెచ్‌డబ్ల్యూవో పోస్టు ఎవరికీ ఇవ్వలేదు. దీంతో మంచిర్యాల గర్ల్స్‌లో ఎస్‌జీటీ టీచర్‌గా పని చేస్తున్న ఒకరు ఇప్పటికీ భీమారంలో హెచ్‌డబ్ల్యూవోగా కొనసాగుతున్నారు. ఒకే సమయంలో అక్కడ వార్డెన్‌గా, మంచిర్యాలో ఎస్‌జీటీగా పని చేస్తున్నారు. అది ఎలా సాధ్యమైందో అర్థం కావడం లేదు. ● ప్రస్తుతమున్న ఏసీఎంవో మంచిర్యాల మల్కపల్లి నుంచి నిర్మల్‌లోని ఓ పాఠశాలకు బదిలీ అయ్యారు. ఇక్కడ అప్లికేషన్ పెట్టుకున్న వారిని పక్కనపెట్టి, ఆయన్ని కొనసాగించడం వెనుక మర్మమేమిటి అనేది అర్థం కావడం లేదు.

నిన్న జరిగింది ఇదీ..

మంచిర్యాల జిల్లాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్‌టీ)ల బదిలీల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. 64 మంది స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి సోమవారం పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరిలో సీనియార్టీ ప్రకారం ఇవ్వకుండా ఏవో కారణాలు చెప్పి డబ్బులు ఇచ్చిన వారికి వారు కోరుకున్న చోట పోస్టింగ్‌లు ఇచ్చారని ఉపాధ్యాయులు అంటున్నారు. ఉదాహరణకు.. సీనియార్టీ లిస్టులో 20వ ప్లేస్‌లో ఉన్న ఉపాధ్యాయుడికి ఏదో కారణం చెప్పి ఫస్ట్ ప్రియార్టీగా కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారంలో ఏసీఎంవో కీలక పాత్ర పోషిస్తున్నారని, దీంతో సీనియర్లంతా నష్టపోవాల్సి వస్తున్నదంటూ ఉపాధ్యాయులు అంటున్నారు. ఆయన్ని ఇక్కడి నుంచి పంపించే వరకూ పోరాటం ఆగదని, అక్రమ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 9వ తేదీన కౌన్సెలింగ్‌లో అన్యాయం జరిగిన వారందరికీ న్యాయం చేయాలని కోరుతున్నారు.

వివరణ ఇవ్వని డీటీడీవో..

ఈ మొత్తం వ్యవహారంలో డీటీడీవో గంగారంను వివరణ కోరేందుకు 'నమస్తే తెలంగాణ' ప్రయత్నించింది. కలెక్టర్‌కు వెళ్లి డీటీడీవో అపాయింట్‌మెంట్ కోరగా.. అక్కడ అటెండర్ సార్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారన్నారు. సార్ కోసం వెయిట్ చేస్తుండగా వీసీ అయిపోయి హడావుడిగా బయటికి వెళ్లిపోయారు. అక్కడే ఉన్న 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి కాల్ చేయగా, ఆయన ఆన్సర్ చేయలేదు. ఇక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీఎంవోను వివరణ కోరగా, నిబంధన ప్రకారమే ప్రస్తుత ట్రాన్స్‌ఫర్లు చేశామన్నారు. ఇందులో తనపాత్ర ఏమీ లేదన్నారు. డీటీడీవోనే దగ్గర ఉండి చూసుకున్నారని చెప్పారు. తనది అక్రమ డిప్యూటేషన్ కాదన్నారు. పీవో ఆర్డర్ ఇచ్చారని అబద్ధం చెప్పాల్సిన అవసరం తనకి లేదన్నారు. 18 నెలల్లో ఉద్యోగ విరమణ పొందుతున్నానని, ఆ బేసిస్‌లో కోరుకున్న చోట డిప్యూటేషన్ ఇచ్చారన్నారు. మరి ట్రాన్స్‌ఫర్ అయ్యేముందు... ఆప్షన్ పెట్టుకునే ముందు ఇవేవీ పరిగణలోకి తీసుకోలేదా అంటే అది ఆప్షన్‌లో ఇవ్వలేదని ఆయన చెప్పారు. నిర్మల్ జిల్లాలో గర్ల్స్ ఆశ్రమపాఠశాలకు పురుషులను ట్రాన్స్‌ఫర్ చేయరని తెలిసి ఆప్షన్ పెట్టుకుంటే అక్కడ ఇచ్చారని, దానికి నేను సిద్ధంగా లేనని చెప్తే పీవో మేడమ్ ఇక్కడే ఏసీఎంవోగా పని చేసేందుకు డిప్యూటేషన్ ఇచ్చారని చెప్పారు. ఉపాధ్యాయులు, ఆదివాసీ సంఘాల నాయకుల ఆందోళనల నేపథ్యంలో దీనిపై గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల, ఐటీడీఏ పీవో ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఊపిరాడక కార్మికుడి మృతి

ఐకే-1ఏ గనిలో విధులు నిర్వహిస్తూ కుప్పకూలిన శ్రీనివాస్

- దవాఖానకు తరలించే లోపే మృత్యువాత
- యాజమాన్యమే బాధ్యత వహించాలని హెచ్ఎంఎస్ ధర్నా
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఐకే-1ఏ గనిపై ధర్నా చేస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

ఎల్లవేన శ్రీనివాస్ (ఫైల్)

జైపూర్, సెప్టెంబర్ 10 : శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారంఖని-1ఏ గనిలో మంగళవారం మొదటి షిఫ్టులో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికుడు ఎల్లవేన శ్రీనివాస్ (35) ఊపిరాడక మృతిచెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనిలోని గాంధీనగర్‌కు చెందిన శ్రీనివాస్ ఐకే-1ఏ మెదటి షిఫ్టు అండర్‌గ్రౌండ్‌లో ఎస్-1 ప్యానల్ 35వ డిప్-4 లెవల్ వద్ద మంగళవారం విధులు నిర్వహిస్తుండగా, గాలి అందక ఉక్కిరిబిక్కిరై కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చి అండర్‌గ్రౌండ్ నుంచి బయటకు తీసుకువచ్చారు. అంబులెన్స్‌లో రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. గనిలో వెంటిలేషన్ సరిగా లేకపోవడం వల్లే శ్రీనివాస్ మృతిచెందినట్లు కార్మికులు పేర్కొంటున్నారు.

గనిపై ధర్నా

శ్రీనివాస్ మృతికి యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్ కార్మికసంఘం ఆధ్వర్యంలో గనిపై ధర్నా నిర్వహించారు. నాయకులు, కార్మికులు మాట్లాడుతూ కొంత కాలంగా 34, 35, 53 డిప్‌లలో గాలి సరఫరా లేదని కార్మికులు యాజమాన్యానికి అనేకసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, శ్రీనివాస్ ఊపిరాడక చనిపోతే గుండెపోటు అని, పిట్స్‌తో చనిపోయాడని పిట్టకథలు అల్లుతున్నారని మండిపడ్డారు. గని రక్షణ అధికారితో పాటు ఇందుకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. ఏరియా హాస్పిటల్ ఉన్న శ్రీనివాస్ మృతదేహాన్ని ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్రావు పరిశీలించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. తన భర్త ఊపిరాడకనే చనిపోయాడని శ్రీనివాస్ భార్య ఎలవేన అనిత జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త పని ప్రదేశంలోనే మృతి చెందినప్పటికీ అధికారులు బతికి ఉన్నట్లుగా దవాఖానకు తరలించి వైద్యమందించినట్లు చిత్రీకరించారని వాపోయింది. వెంటనే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేసింది.

విద్యార్థులకు జ్వరం గురుకులానికి తాళం

- సిర్పూర్-టీ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో 30 మందికిపైగా వైరల్ ఫీవర్స్
- మూడు రోజులు సెలవులు ప్రకటించిన అధికారులు
- పిల్లలను పరామర్శించిన సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

మూడు రోజులు సెలవులు ఇవ్వడంతో ఇంటికి వెళ్లిపోతున్న విద్యార్థులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ సిర్పూర్(టీ), సెప్టెంబర్ 10 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల-కళాశాల జ్వరాలతో మంచం పట్టగా, అధికారులు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి పిల్లలను ఇళ్లకు పంపించి వేశారు. ఇక్కడ సుమారు 450 మంది విద్యార్థులు చదువుతుండగా, మూడు నాలుగు రోజుల క్రితం 30 మందికి పైగా ఒకేసారి జ్వరాల బారిన పడ్డారు. అయితే, అందరినీ ఒకేసారి తరలిస్తే ఏమవుతుందోనని భయపడ్డ పాఠశాల సిబ్బంది.. విడుతల వారీగా పిల్లలను సిర్పూర్(టీ) సామాజిక దవాఖానకు తరలించినట్లు తెలుస్తున్నది. సరిపడా బెడ్లు లేక గురుకుల పాఠశాల నుంచి తెప్పించి మరీ వాటిపైనే విద్యార్థులకు చికిత్స అందించారు. ఇక ఇదిలా ఉంటే సుమారు 100 మందికి జ్వరాలు వచ్చినట్లు తెలుస్తుండగా, గురుకులంలో పరిస్థితి చేయిదాటిపోతుందని గమనించిన అధికారులు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. పూర్తి స్థాయి వైద్యమందించాల్సింది పోయి ఏకంగా పాఠశాలకు సెలవులు ప్రకటించి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

విద్యార్థులను పరామర్శించిన సబ్ కలెక్టర్

సిర్పూర్(టీ) సామాజిక దవాఖానలో చికిత్సపొందుతున్న విద్యార్థులను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మంగళవారం పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ఒకేసారి జ్వరాలబారిన పడడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూడు.. నాలుగు రోజులుగా విద్యార్థులకు జ్వరాలు వస్తున్నా పాఠశాల సిబ్బంది ఏం చేస్తుందని ఆరా తీశారు. కాగా, విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

అధికారుల నిర్లక్ష్యమేనా..?

జిల్లాలోని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అధికారులు ముందుస్తు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే జ్వరాలు వ్యాపిచెందుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పారిశుధ్య పనులు, దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడం వల్లే పిల్లలు మంచం పట్టాల్సి వచ్చిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

గేటు మూసి ఉన్న గురుకుల పాఠశాల

సర్కారు దవాఖానలో మందుల్లేవ్

- చెన్నూర్ హాస్పిటల్‌లో అధ్వాన పరిస్థితి
- డాక్టర్లు రాసిచ్చిన గోలీలు బయట కొనుక్కుంటున్న రోగులు
- విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్ క్లినిక్‌లకు పరుగులు

చీటీ చూపిస్తున్న మనోజ్ కుమార్

డాక్టర్ రాసిన మందుల చీటీ, సీల్ ఉండి మందులేని సీసా

చెన్నూర్‌లోని ప్రభుత్వ దవాఖాన

చెన్నూర్, సెప్టెంబర్ 10 : 'పక్క చిత్రంలో ఉన్నది చెన్నూర్ పట్టణానికి చెందిన మనోజ్‌కుమార్. ఈ నెల 4న తన కుమారుడు సాయి నిర్విగ్నకు విరేచనాలు కావడంతో స్థానిక ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లాడు. అవుట్ పేషెంట్‌గా పేరు నమోదు చేసుకొని పిల్లల డాక్టర్‌కు చూపించాడు. బాలుడిని పరీక్షించిన వైద్యుడు ఐదురకాల మందులు రాసిచ్చాడు. చీటీ పట్టుకొని ఫ్మారసీ సెంటర్‌కు వెళ్లి చూపించాడు. ఇందులో ఒక్క టానిక్ మాత్రమే ఉందని, మిగితావి బయట కొనుక్కోవాలని అక్కడున్న సిబ్బంది తెలిపింది. ఇదేమిటని మనోజ్‌కుమార్ అడిగితే.. ప్రభుత్వం నుంచే మందులు రావడం లేదని, వస్తే ఇవ్వమా అంటూ ఎదురు ప్రశ్నించారు. ఇక మీరిచ్చిన టానిక్ సీసాకు సీల్ ఉన్నప్పటికీ అందులో మందు లేదని అడుగగా, అది అక్కడి నుంచే వచ్చిందని చెప్పారు. ఇక విధిలేని పరిస్థితిలో తన కుమారుడిని మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లాల్సి వచ్చింది.' ఇదీ చెన్నూ ర్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన పరిస్థితి..

కాంగ్రెస్ సర్కారులో..

నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో కేసీఆర్ సర్కారులో అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ చెన్నూర్ ప్రభుత్వ దవాఖానను వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తీసుకొచ్చారు. అంతేగాకుండా పాత దవాఖాన భవనం శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో దాదాపు రూ. 10 కోట్లతో అధునాతన భవనాన్ని నిర్మించారు. సరిపడా డాక్టర్లు, సిబ్బందిని నియమించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో చెన్నూర్ ప్రభుత్వ దవాఖాన పరిస్థితి అధ్వానంగా మారింది. మందుల కొరత వేధిస్తుండగా, రోగులు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. వివిధ రోగాలతో దవాఖానకు వచ్చే వారు బయట మందులు కొనుక్కోవాల్సి వస్తున్నది. మందుల్లేని దవాఖానకు వచ్చి ఏం లాభమంటూ అనేక మంది ప్రైవేట్ డాక్టర్లను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. కాగా, ఈ విషయమై దవాఖాన సూపరింటెండెంట్ సత్యనారాయణను వివరణ కోరగా, ఈ విషయం తన దృష్టికి రాలేదని, సిబ్బంది ద్వారా విచారణ జరిపిస్తామని తెలిపారు. దవాఖానలో అన్ని రకాల మందులు ఉన్నాయని చెప్పారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679